క్లుప్తంగా

జపాన్ పర్యటనకు వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: జపాన్‌లో పది రోజుల పర్యటనకు ఓయూ వీసీ ప్రొ.రవీందర్ రేపు బయలుదేరనున్నారు. టోక్యోలోని సిబుల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆహ్వానం మేరకు పది మంది ఓయూ ఇంజినీరింగ్, సైన్స్ కాలేజీల విద్యార్థులతో జపాన్‌కు వెళ్తారని అధికార వర్గాలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: లాలాగూడ, ఐసీటీ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సండే మార్కెట్, నాగార్జుననగర్, షిర్డీసాయి నగర్, శ్రీనివాస అపార్ట్‌మెంట్, పార్కు ప్రాంతాలు.
- మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు దాల్‌మిల్–1, గుడిమిల్ల విల్లా, నాగార్జున కమ్యూనిటీ హాల్, అప్పారావు పీటీ, వైషాలి అపార్ట్‌మెంట్ ప్రాంతాలు.
- డెక్కన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

దశలవారీగా పదోన్నతులు

గాంధీఆస్పత్రి: విధి నిర్వహణలో భాగంగా ఉద్యోగులు పొందే పదోన్నతి వారి బాధ్యతలను మరింత పెంచుతుందని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న పలువురు నాల్గవ తరగతి ఉద్యోగులను క్లరికల్ గ్రేడ్ పదోన్నతి కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరికి దశలవారీగా పదోన్నతులు కల్పిస్తామన్నారు. ప్రలోభాలకు లొంగకుండా చిత్తశుద్ధితో విధులను నిర్వహించి నిరుపేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేయాలన్నారు. క్లరికల్ గ్రేడ్ పదోన్నతి పొందిన రవితేజ, భాస్కర్, గోవర్ధన్, విశాల్, పద్మ సూపరింటెండెంట్ రాజారావుకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, ఏడీ ఫ్లోరెన్స్‌మెర్లిన్, ఆర్‌ఎంఓలు వెంకటరమణ, వసుధరాణి, రాము, సత్యరత్న, ఆఫీస్ సూపరింటెండెంట్ రాంచందర్, జనరల్ మేనేజర్ వెంకటసంతోష్ రమణ, టీఎస్‌జీవో గాంధీ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్, యాదిలాల్, సభ్యులు శ్రవణ్‌కుమార్, ఖలీమ్, విశ్వనాథ్, జనార్ధన్, సత్యనారాయణ, మక్సూద్, సరళ, భావన పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతు

బన్సీలాల్‌పేట్: సరదా కోసం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతైన ఘటన షామీర్‌పేట్‌లో జరిగింది. స్థానికులు, ప్రత్యక్షసాక్ష్యుల కథనం ప్రకారం.. బన్సీలాల్‌పేట్ డివిజన్ జయప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ జహంగీర్(45) చేపలు పట్టేందుకు సోమవారం షామీర్‌పేట్ చెరువుకు సుమారు 6 మంది కలిసి వెళ్లారు. ముందుగా జహంగీర్ చెరువులోకి వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. సోదరుడు చోటన్ జహంగీర్ కోసం చెరువులోకి కొద్ది దూరం వెళ్లి తిరిగి వచ్చాడు. బస్తీ వాసుల కలిసి వెతకడానికి ప్రయత్నించారు. అప్పటికే చీకటి కావడంతో మంగళవారం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపడుతామని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంటోన్మెంట్: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన బోయిన్‌పల్లి పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ యుగంధర్ వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన గుడ్డు చౌదరి(40) భార్య, ముగ్గురు కూతుళ్లతో కలిసి బోయిన్‌పల్లిలో ఉంటూ జీడిమెట్లలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం సైకిల్‌పై జీడిమెట్లకు బయలుదేరగా, డెయిరీ ఫామ్ క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. గాయపడిన గుడ్డు చౌదరిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సోనీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాభీష్టం మేరకే నడుచుకోవాలి

సనత్‌నగర్: దాసారం బస్తీ కమ్యూనిటీ హాల్‌ను అందరి ఆమోదం మేరకు అక్కడి ప్రజావసరాలకు ఉపయోగించాలే కానీ, బలవంతంగా బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయడం సరికాదని బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి తలసాని అధికార దుర్వినియోగానికి పాల్పడడం అనాదిగా వస్తోందని, అదే క్రమంలో స్థానికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ మేరకు మర్రి శశిధర్‌రెడ్డి సోమవారం ఓ వీడియో విడుదల చేశారు. బస్తీ దవాఖానా ఏర్పాటుపై బస్తీవాసులు అభ్యంతరం చెప్పగా ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు కమ్యూనిటీ హాల్‌కు సంబంధించి డాక్యుమెంట్లు తీసుకురావాలని, లేనిపక్షంలో రిమాండ్‌కు తరలిస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని, సరిపోని పక్షంలో తనను రిమాండ్ చేయాలన్నారు. బస్తీ వాసులపై ఒత్తిడి చేయవద్దని వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడం జరిగిందన్నారు. అందరికీ ఆమోదయోగ్యం ఉండేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందన్నారు.

కూచిపూడిలో ప్రతిభ రాజ్

- శిక్షణలో 20 ఏళ్ల ప్రస్థానం
- వేల సంఖ్యలో ప్రదర్శనలు, సన్మానాలు, పురస్కారాలు
- ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న కళాకారిణి ప్రతిభారాజ్



శిష్యులకు మెలుకువలు నేర్పుతూ..

లాలాపేట: నాట్య శిక్షణే పరమావధిగా ఎంచుకుని 20 ఏళ్ల నుంచి కూచిపూడి నృత్య శిక్షణను కొనసాగిస్తూ వేల సంఖ్యలో నృత్య కళాకారులను తయారు చేస్తున్నారు శ్రీ వెంకటేశ్వరా నృత్యానికేతన్ నాట్య కళాశాల నిర్వాహకురాలు డా. ప్రతిభారాజ్ గౌడ్. 15 సంవత్సరాల వయస్సులో ప్రముఖ గురువు డా. శోభానాయుడు వద్ద కూచిపూడి శిక్షణ తీసుకున్న ఆమె తన నృత్య కళలలో రాణిస్తున్నారు. వివాహ అనంతరం లాలాపేట కేంద్రంగా శ్రీ వెంకటేశ్వరా నృత్యానికేతన్ నాట్య కళాశాలను స్థాపించి డిప్లమా ఇన్ కూచిపూడి సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తున్నారు. మరో వైపు పండుగలు, పర్వదిన సందర్భంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వేల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చారు. కూచిపూడి నృత్యంలో అందరి ప్రసంసలు పొందుతూ లాలాపేట పేరును ఇనుమడింపజేస్తున్నారు. సన్మానాలు అవార్డులతో పాటు ఇటీవల ఆమె గౌరవ డాక్టరేట్‌నూ పొందారు. త్వరలో విదేశాల్లో సైతం ప్రదర్శనలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు.

శక్తి ఉన్నంత వరకూ శిక్షణ కొనసాగిస్తా..



ఏ రంగంలోనైనా రాణించాలంటే సరైన గురువుల మార్గదర్శకత్వంలో శిక్షణ తీసుకోవాలి. కూచిపూడి నృత్యంతో వ్యక్తి జీవితంలో క్రమశిక్షణ, ఏకాగ్రత, గురువుల పట్ల గౌరవం పెరుగుతుంది. శిక్షణ ఇచ్చిన గురువులను జీవితాంతం గుర్తు పెట్టుకోవాలి.అప్పుడే నేర్చుకున్న కళకు సార్థకత లభిస్తుంది. తనకు శక్తి ఉన్నంత వరకు కూచిపూడి నృత్య శిక్షణను కొనసాగిస్తాను.

– డా. ప్రతిభారాజ్ గౌడ్

కళాకారిణిగా గుర్తింపు పొందాలి..



ప్రతిభారాజ్ వద్ద శిష్యరికం చేయడం ఎంతో గర్వంగా ఉంది. గత ఐదేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నా. ఎంతో నేర్పు, సహనంతో నాట్య శిక్షణ ఇస్తున్నారు. గురువు ఆధ్వర్యంలో ఎన్నో స్టేజ్‌షోలు ఇచ్చి ప్రశంసలు పొందాను. జీవితంలో కూచిపూడి నృత్యంలో ప్రముఖ కళాకారిణిగా గుర్తింపు పొందాలి.

– శ్రేయ, విద్యార్థి

కొరియోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకుంటా..



శ్రీ వెంకటేశ్వరా నృత్యానికేతన్‌లో గత నాలుగేళ్లుగా కూచిపూడితో పాటు గర్బ, దాండియా, తెలంగాణ ఫోక్ వంటి కళల్లో శిక్షణ తీసుకుంటున్నా. గురువు ప్రతిభారాజ్ ఆశీస్సులు, ప్రోత్సాహంతో భవిష్యత్‌లో పేరు పొందిన కొరియోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకోవాలని కోరిక.

– అక్షిత, విద్యార్థి


డాక్టరేట్‌ను అందుకుంటున్న ప్రతిభారాజ్ (ఫైల్)

ప్రదర్శనలు...

- తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం, భద్రాచలం, యాదాద్రి, ముచ్చింతల్ వంటి పుణ్య క్షేత్రాలతో పాటు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో తన శిష్య బృందంచే ప్రదర్శనలిచ్చారు. సిలికానాంధ్ర, రెండవ అంతర్జాతీయ కూచిపూడి డ్యాన్స్ కన్వెన్షన్, బాలోత్సవ్ కొత్తగూడెం, వరల్డ్ కల్చరల్ ఫెస్ట్ న్యూ ఢిల్లీ తదితర ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తాజాగా ఇదే మాసంలో ఆంధ్రప్రదేశ్ చిలకలూరిపేటలో కళానిలయం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు.

ఇటీవల డాక్టరేట్..

- రెండు దశాబ్దాల నుంచి కూచిపూడి నృత్యంతో పాటు గర్బ, దాండియా, తెలంగాణ జానపదం తదితర నృత్యాలలో శిక్షణను అందిస్తున్న ప్రతిభారాజ్ కృషిని గుర్తించి 2022లో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి సత్కరించింది. 2022లో సత్యభామ, నాట్య సరస్వతి, నాట్య గురురత్న అవార్డు, ఉగాది పురస్కారాలు అందుకున్నారు. గిన్నీస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను సైతం పొందారు.

పర్మనెంట్ జాబితాలో వర్సిటీ ఉద్యోగులనూ చేర్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రాక్టు ఉద్యోగుల పర్మనెంట్ జాబితాలో రాష్ట్ర యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు, నాన్ టీచింగ్ టీచింగ్ స్టాఫ్‌నూ చేర్చాలని ఔటా–సీ అధ్యక్షులు డాక్టర్ పరుశురామ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంత్రి హరీష్‌రావు ఏప్రిల్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి: గద్దర్



రాంగోపాల్‌పేట్: బాలికలు తమకు ఇష్టమైన రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు స్వయం కృషితో ముందుకెళ్లాలని ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల) వార్షికోత్సవం, వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అంతరిక్షంలోకి సత్తా చాటారని అన్నారు. ఈ సందర్భంగా గద్దర్ తన ఆటాపాటలతో విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థినులు సైతం తమ డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల భవన దాత డాక్టర్ మునగ రామ మోహనరావు, పట్టాబి, హరగోపాల్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్వల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



బన్సీలాల్‌పేట్: ప్రజల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. ఓల్డ్‌గ్యాస్‌మండి, మేకలబండ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఉప్పలమ్మ దేవాలయం వద్ద రూ. 45లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటం చూసి మంత్రి అసహనం వ్యక్తం చేస్తూ వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మూడ్రోజుల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్‌ను ఆదేశించారు. అనంతరం మేకలబండ కమ్యూనిటీహాల్‌ను సందర్శించారు. కమ్యూనిటీహాల్లో టాయిలెట్స్ మరమ్మతులు ప్రహరీ నిర్మించాలని స్థానికులు మంత్రికి విన్నవించగా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. మంత్రి వెంట డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, తహసీల్దార్ శైలజ, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు మనోజ్, జగన్, మహేష్ గౌడ్, వినయ్ పాల్గొన్నారు.

లేబర్ అడ్డాల వద్ద వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: నగరంలోని లేబర్ అడ్డాల వద్ద కనీస వసతులు కల్పించే విధంగా జీహెచ్‌ఎంసీ తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం అడ్డగుట్టలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సికింద్రాబాద్ పరిధిలో పనిచేసే (ఏఐటీయూసీ) భవన నిర్మాణ కార్మికులతో కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు నాగరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొట్టకూటి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులకు లేబర్ అడ్డాల వద్ద కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని తుకారాం గేట్, లాలాపేట్, వారాసిగూడ, తార్నాక, వారాసిగూడ, చిలకలగూడ వంటి పలు ప్రాంతాల్లోని లేబర్ అడ్డాల వద్ద మూత్రశాలలు నిర్మించి తాగు నీటి సౌకర్యం కూడా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో యాదగిరి, శ్రీనివాస్, శంకర్, జయరాజ్, ఎల్లయ్య, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం..

చిలకలగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటం చేస్తున్న తమకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. చిలకలగూడ దూద్‌బావి కమ్యూనిటీ హాల్లో డివిజన్ కార్యదర్శి సోమయ్య నేతృత్వంలో జరిగిన మెట్టుగూడ డివిజన్ సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. అన్నారు. డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 15 మంది సభ్యులతో మెట్టుగూడ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి బాబు, వెంకటయ్య, యాదగిరి, కనకయ్య, సరసయ్య, కొమురయ్య, చందర్, సంతోష్, అనిత పాల్గొన్నారు.

‘రానున్న ఎన్నికల్లో బీజేపీదే విజయం’


డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

సికింద్రాబాద్: రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించబోతుందని ఆ పార్టీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ధీమా వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండిలోని ఆర్కే ఫంక్షన్ హాల్లో సోమవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాచమల్ల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో సారంగపాణి పాల్గొని మాట్లాడారు. పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సికింద్రాబాద్‌లో నిర్వహించబోయే క్రీడలకు సంబంధించి నియోజకవర్గంలోని క్రీడాకారుల పేర్లను సేకరించాలని సూచించారు. అనంతరం నూతన సంవత్సరానికి సంబంధించిన బీజేపీ డైరీలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో హరి, ప్రభుగుప్తా, ప్రకాష్‌గౌడ్, రాజేశ్వరరావు, శ్రీధర్ రావు, హనుమంతు ముదిరాజ్, రాముపర్మ, అంబాల మహేష్, అనిత, అను పాల్గొన్నారు.


ఆర్థికమంత్రి హరీష్‌రావు సోమవారం రాష్ట్ర 2023–24 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సందర్భంగా ఆయనను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.
– సాక్షి, సిటీబ్యూరో

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: పెళ్లికి ముందు ఇద్దరి మధ్య ఉన్న పరిచయాన్ని ఆసరాగా చేసుకుని వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. బోరబండ ఇందిరానగర్‌కు చెందిన ఓ యువతి బీఎస్సీ నర్సింగ్ చదువుతుంది. ఆమెకు ఇటీవల వివాహం జరిగింది. పెళ్లికి ముందు వికారాబాద్ చెందిన జనార్ధన్ అనే వ్యక్తితో పరిచయం ఉంది.ఈ క్రమంలో తరుచూ యువతికి ఫోన్లు చేసి వేధిస్తున్నాడు. తన కోరిక తీర్చాలని, లేకుంటే తన వద్ద ఉన్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని వేధింపులకు పాల్పడటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వర్సిటీల ఖాళీల భర్తీకి దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఓయూ అధ్యాపకులు ఒక రోజు దీక్ష చేశారు. ఖాళీల భర్తీలో జాప్యాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బహిరంగ ప్రదేశంలో బోధిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రొ.కాశీం, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ మంగు, చీఫ్ వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్, కామర్స్ హెడ్ ప్రొ.చెన్నప్ప, విద్యార్థి నేతలు ఆర్‌ఎస్ శంకర్, చనగాని దయాకర్, పలు వామ పక్ష విద్యార్థి పాల్గొన్నారు.

అర్ధరాత్రుల్లో సంచరిస్తున్న ఇద్దరికి జైలు

అడ్డగుట్ట: అర్ధరాత్రుల్లో బస్తీల్లో సంచరిస్తున్న ఇద్దరు యువకులకు 30 రోజుల జైలు శిక్ష విధించినట్లు లాలాగూడ ఇన్‌స్పెక్టర్ మధులత తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌కు చెందిన సయ్యద్ సుమేయిర్ అశ్రఫ్(22), కే. స్టీఫెన్(19) ఇద్దరు గతకొన్ని రోజులుగా అర్ధరాత్రుల్లో ఇనుప రాడ్డు, కత్తి పెట్టుకొని పలు కాలనీల్లో సంచరిస్తున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని లాలాగూడ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సోమవారం వీరిని 16వ స్పెషల్ ఎంఎం కోర్టు ముందు ప్రవేశపెట్టగా 30 రోజుల జైలు శిక్ష విధించారు. అయితే.. ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా అశ్రఫ్, స్టీఫెన్లపై గాంజా, సెల్‌ఫోన్ స్నాచింగ్ కేసులు ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అరుంధతీయ బంధుసేవా మండలి అధ్యక్షుడిగా కేపీ నర్సింగ్‌రావు


కేపీ నర్సింగ్ రావు


బి. నర్సింగ్ రావు

బన్సీలాల్‌పేట్: అరుంధతీయ బంధు సేవా మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కేపీ నర్సింగ్‌రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా బి. నర్సింగ్‌రావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి జి. వేదరత్నం ఆధ్వర్యంలో జరిగిన బంధు సేవా మండలి ఎన్నికలో వివిధ జిల్లాల నుంచి అనేక మంది వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా కేపీ నర్సింగ్‌రావు, సెక్రటరీ జనరల్‌గా జీబీ సత్యం ద్రక్రిష్ణ, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎ. చక్రపాణి, జి. ఈశ్వర్, మేకల నారాయణలు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా సి. నరేందర్, వై.ఎల్. బాలప్రసాద్, పి. యాదగిరి, కార్యదర్శులుగా అత్తిగల్ల రాజశేఖర్, సి. మణిరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా జీబీ మాధవీ ఎంపికయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా బి. నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా దానగల్ల పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డీఎం. అశోక్‌కుమార్, ఆర్. జగన్మోహన్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పి. సురేష్‌కుమార్, కేఆర్‌బీ ప్రకాష్, సభ్యులుగా స్వాతి, దర్శనం వేణుగోపాల్, వి. మైత్రేయ, బక్కని బాబు శంకర్, జె. అశోక్ ఎన్నికయ్యారు.

టాటా ట్రస్ట్స్ ఆధ్వర్యంలో ‘కైసే కా కేన్సర్’

సాక్షి,సిటీబ్యూరో: ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని టాటా ట్రస్ట్స్ ఆధ్వర్యంలో ‘కైసే కా కేన్సర్’ పేరిట ప్రచారం చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అవేర్‌నెస్, యాక్సెస్‌బులిటీ, క్వాలిటీ కేర్, అఫర్డబులిటీ అనే నాలుగు అంశాలపై ఈ ప్రచారం దృష్టి సారిస్తుందని, చిన్న పట్టణాలు, వైద్య వసతి లేని గ్రామీణ ప్రాంతాల్లో కేన్సర్ బాధిత కుటుంబాలలో ఏర్పడే గందరగోళాన్ని నివారించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆలోచనలు కీలకం


బహుమతులు అందుకున్న సీనియర్ సిటిజన్లతో కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డీఎంసీ మోహన్‌రెడ్డి

సనత్‌నగర్: సీనియర్ సిటిజన్స్ అనుభవాలు కుటుంబ అభివృద్ధికే కాకుండా సమాజాభివృద్ధికి కూడా దోహదపడాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలోని సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి సోమవారం బహుమతులు అందజేశారు. ఆసరా కమిటీ అధ్యక్షుడు, డిప్యూటీ కమిషనర్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ అంతా ఒకచోట చేరి ఎంతో ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఎలాంటి రుగ్మతలు మన దరికి చేరవన్నారు. మానసిక ప్రశాంతతకు ఆటలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. డీఎంసీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అందరూ కలిసి మెలిసి ఆటల పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ తరుపున సీనియర్ సిటిజన్స్‌కు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జెఎస్‌టీ శాయి, వైడీకే ప్రసాద్, పార్థసారథి, కృష్ణారెడ్డి, దశరథరెడ్డి, రాఘవయ్య, నాగమణి, పద్మిని, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

క్యారమ్స్ సింగిల్ విభాగంలో విజేతగా పసాద్, రన్నర్‌గా కృష్ణారెడ్డి గెలుపొందారు. క్యారమ్స్ డబుల్స్‌లో రాజేందర్, భద్రయ్య, రన్నర్స్‌గా బుచ్చప్ప, కృష్ణారెడ్డి నిలిచారు. చెస్‌లో ప్రథమ స్థానంలో గంగాధర్, రన్నర్‌గా ప్రసాద్, జనరల్ నాలెడ్జ్‌లో ఉమామహేశ్వరరావు, నజీర్ అహ్మద్, పూర్ణచంద్రరావు, ఎం.చిదంబరరావు విజేతలుగా నిలిచారు. క్యారమ్స్ మహిళలు సింగిల్స్‌లో విన్నర్‌గా నాగమణి, రన్నర్‌గా రాజేశ్వరి, చెస్ మహిళల విభాగంలో విన్నర్‌గా పద్మిని విజేతగా నిలిచారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి


కంటి వెలుగు శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్

లాలాపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ఆమె హాజరై అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.పి. మోహన్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణలో అంధత్వ సమస్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగుకు స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, షఫి, హరికుమారి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోశీల్యా రాణి పాల్గొన్నారు.

కొలువుదీరిన బోయిన్‌పల్లి మార్కెట్ కొత్త కమిటీ


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సాయన్న

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా సాగింది. శనివారం నూతన కమిటీ నియామకాన్ని మంత్రిత్వ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులతో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సాయన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ రాగిరి హారిక, వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి, సభ్యులుగా బండి రామకృష్ణ, మీనా భాస్కర్, దేవులపల్లి శ్రీనివాస్, బి.నారాయణ, ఎం.గిరిధర్, డీ. శ్రీనివాస్ గౌడ్, షేక్ నయీమ్, ఎస్. సుశాంత్ రెడ్డి, బీ.భాస్కర్, జవహర్‌లాల్, శ్రీరాముల ప్రభాకర్, గౌతమ్ చాంద్ ప్రమాణ స్వీకారం చేశారు.

మరింత అభివృద్ధి చేయాలి..

జంటనగరాల్లోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్ కలిగిన బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ ఈ పాటికే దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఏకంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించింది. రాబోయే రోజుల్లో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నానని ఎమ్మెల్యే సాయన్న పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీలో మాదిగలకు అన్యాయం..

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ మార్కెట్ కమిటీ నియామకంలో మాదిగ ఉపకులాలకు అన్యాయం జరిగిందంటూ ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇటుక శ్రీకిషన్ ఆరోపించారు. సోమవారం మార్కెట్ యార్డు ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకిషన్ మాట్లాడుతూ.. ప్రస్తుత కమిటీని రద్దు చేసి, మాదిగలకు కమిటీలో స్థానం కల్పించాలని లేని పక్షంలో తమ ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. దళిత బంధు విషయంలోనూ ఎమ్మెల్యే సాయన్న తన సామాజిక వర్గానికే ప్రాధాన్యం ఇచ్చి, మాదిగల పట్ల వివక్ష చూపారని అన్నారు. ఈ కార్యక్రమంలో అజిత్ కళ్యాణ్, మంద మధుకర్ మాదిగ, నరసింహ, విష్ణు పాల్గొన్నారు.

వేరీడ్ బోర్డు మరో ఆరు నెలల పొడిగింపు

ఉత్తర్వులు జారీ చేసిన రక్షణ శాఖ

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తో పాటు దేశ వ్యాప్తంగా 56 కంటోన్మెంట్‌ల వేరీడ్ బోర్డులను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయా కంటోన్మెంట్‌లలో కొనసాగుతున్న వేరీడ్ బోర్డుల గడవు ఈ నెల 10వ తేదీ నాటికి ముగియనున్న నేపథ్యంలో రక్షణ శాఖ సోమవారం ఆయా బోర్డుల పదవీ కాలాన్ని పొడిగించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సాధారణ పాలక మండలి గడవు 2021 ఫిబ్రవరి 10వ తేదీ నాటికే ముగియగా తొలిసారి ఏడాది పాటు వేరీడ్ బోర్డును నియమించింది. నాటి వేరీడ్ బోర్డులో స్థానిక మిలటరీ స్టేషన్ కమాండర్, సీఈఓ మాత్రమే సభ్యులుగా ఉన్నారు.

2021 నవంబర్ నెలాఖరులో నామినేటెడ్ సభ్యుడిగా రామకృష్ణను నియమించడంతో ముగ్గురు సభ్యులతో పూర్తిస్థాయి వేరీడ్ బోర్డు కొలువుదీరింది. ప్రస్తుతం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో బ్రిగేడియర్ సోమశంకర్, సీఈఓ మధుకర్ నాయక్, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడిగా జే.రామకృష్ణ కొనసాగుతున్నారు.